

శతాధిక వృద్ధుడి మృతి



ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌కు చెందిన మాజీ వార్డు సభ్యులు ఎర్రోళ్ల పెద్ద నర్సింహ (104) మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఆయన 1984లో ఎదులాబాద్ జీపీలో వార్డు సభ్యుడిగా, తర్వాత రైతు సంఘం నాయకుడిగా సేవలందించాడు. గ్రామానికి పెద్దదిక్కుగా ఉన్న ఆయన మృతి చెందడం పట్ల గ్రామస్తులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌వో వెంకటరవణ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటరవణ

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కలిగించాలని డీఎంహెచ్‌వో వెంకటరవణ వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రామయ్యగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ లక్షణాలను నివారణ, స్క్రీనింగ్, పరీక్షలు, చికిత్స మొదలైన వాటి గురించి ఆశాలకు, ఎన్ఎంలకు, సిబ్బందికి, గర్భిణులకు, తల్లులకు ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా నేడు ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

లక్ష్యాలను సాధించాలి

ప్రోగ్రామ్ అధికారి నిరోషా మాట్లాడుతూ ఆశా డే, ఆరోగ్యమహిళా సమావేశాలలో క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటు ఎన్‌సీడీ కార్యక్రమాల గురించి వివరించి లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నిఖిల, అధికారులు శ్రీనివాసులు, రేణుకుమార్, జయరాం, ఎన్ఎంలు, ఆశాలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు న్యాయ సేవల అథారిటీ సిబ్బంది వెంకటేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాకేది భరోసా?

ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

రైతుభరోసా పథకం ద్వారా అందజేసే పెట్టుబడి సాయం ఇప్పటికే ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతులకు అందించారు. దీంతో మిగతా గ్రామాల రైతులు 'మాకేది భరోసా' అంటూ ఆశగా ఎదురు చూస్తున్నారు. తొలివిడతలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 గ్రామాల్లోని 26,843 మంది రైతులకు రూ.35.36 కోట్ల సాయాన్ని అందించారు. కాగా, మలి విడత కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. త్వరలోనే అర్హులందరికీ రైతు భరోసా అందుతుందని వ్యవసాయ అధికారులు చెబుతుండటం గమనార్హం.



తొలి విడతలో పెట్టుబడి సాయం పంపిణీ ఇలా

జిల్లా	గ్రామాలు	రైతులు	రూ.కోట్లలో
రంగారెడ్డి	21	15,531	20.25
మేడ్చల్	05	2,703	3.93
వికారాబాద్	20	8,609	11.18

- తొలివిడతలో 26,843 మంది రైతులకు లబ్ధి
- ఉమ్మడి జిల్లాలో రూ.35.36 కోట్లు విడుదల
- మలి విడతపై మిగతా రైతుల ఆశలు
- రైతుభరోసాకు 1,082 గ్రామాల రైతుల నిరీక్షణ

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ రైతుకు జనవరి 26 తర్వాత 'భరోసా' అందుతుందని ప్రభుత్వ వర్గాలు చెప్పడంతో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో 7,01,322 ఎకరాలు, వికారాబాద్ జిల్లాలో 6,42,006 ఎకరాలు, మేడ్చల్ జిల్లాలో 64,860 ఎకరాల సాగు భూములకు పెట్టుబడి సాయం అందాల్సి ఉంది. కాగా, తొలి విడతగా రంగారెడ్డి జిల్లాలో 21 మండలాల్లో 21 గ్రామాలను ఎంపిక చేసి 15,531 రైతుల ఖాతాల్లో రూ.20.25 కోట్లు జమ చేశారు. అలాగే మేడ్చల్ జిల్లాలో ఎంపిక చేసిన 5 గ్రామాల్లో 2,703 రైతుల ఖాతాల్లో రూ.3.93 కోట్లు, వికారాబాద్ జిల్లాలో 20 గ్రామాల్లోని 8,609 రైతుల ఖాతాల్లో రూ.11.18 కోట్లు జమ చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 46 గ్రామాల్లో 26,843 రైతుల ఖాతాల్లో రూ.35.36 కోట్లు జమ చేసింది. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ మండలం అన్నారంలో

మిగతా 7వ పేజీలో...

రోజుకో మాట చెబుతున్న ప్రభుత్వం



రైతులకు పెట్టుబడి సాయంగా ప్రభుత్వం పంపిణీ చేసే రైతుభరోసా పథకంపై నమ్మకం పోతోంది. ప్రభుత్వం రోజుకో మాట చెబుతోంది. మొదట దసరాకు వేస్తామని, ఆ తర్వాత సంక్రాంతి పండగకు వేస్తాం అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏడాది నుంచి పెట్టుబడి సాయం లేదు. ఆశగా ఎదురుచూసి విసిగి పోయాం. గతంలో ఏడెకరాలకు తమ కుటుంబానికి రూ.35 వేలు ఖాతాలో పడుతుండే. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇంత వరకు పెట్టుబడి సాయం డబ్బులు రాలేదు. ఎప్పుడిస్తారో తెలియడం లేదు. పంట లాగోడులకు ఇబ్బంది పడుతున్నాం.

- రమేశ్, రైతు, డీకే తండా, ధారూరు మండలం

నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి



రైతునేస్తం కార్యక్రమంలో డీఏవో మోహన్‌రెడ్డి

ధారూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): లైసెన్సులు కలిగిన డీలర్ల వద్దనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి రైతులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ధారూరులోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసిన ఆయన డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులకు సంబంధించి కొనుగోలు బిల్లులు, అమ్మకం రశీదులను, స్టాక్, సేల్ రిజిస్టర్లను నిర్వహించాలన్నారు. రైతులకు అవసరమున్న ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే నకిలీ విత్తనాలు, ఎరువులను రైతులకు అంటగట్టకూడదని హెచ్చరించారు. అనంతరం కెరెల్లిలో నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఏఈవోలు ఈ సర్వే చేస్తున్నారని, ఒక్కో ఏఈవోకు 2 వేల ఎకరాలు, మహిళ ఏఈవోలకు 1,800 ఎకరాల చొప్పున డిజిటల్ క్రాప్ సర్వేకు కేటాయించామని ఏవో సూర్యప్రకాశ్ తెలిపారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ సీఈవో నర్సింహులు, ఏఈవో సంతోష్ , రైతులు, ఫర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



వార్డు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

కీసర, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల్, కీసర వార్డు కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని మంగళవారం వార్డు కార్యాలయాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్న కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా కాలాయాపన చేయడం సరికాదన్నారు. అలాగే రోజుకు 8 గంటల పని, రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వేతనాలు చెల్లించాలని సంబంధిత అధికారికి కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రవి, నారయ్య, రవీందర్, సాయిలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఉండొద్దు

- మంజూరైన పనులను ప్రారంభించాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష

కొడంగల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కడా కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఇప్పటికే మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కడా కింద మంజూరైన అంగన్‌వాడీ, మండల సమీకృత భవనాలు, ప్రహరీ, అదనపు తరగతి గదుల పనులను ప్రారంభించాలని తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన రూ.5 లక్షలలోపు సీసీ రోడ్డు పనులను చేపట్టాలన్నారు. గ్రామ కూడళ్లలో నాణ్యమైన హైమాక్స్ వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, మిషన్ భగీరథ ఎస్ఈ జగన్‌మోహన్, ఈఈ చల్మారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ భవనానికి మరమ్మతులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన మరమ్మతు పనులను చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిసర్లను తనిఖీ చేశారు. అలాగే ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వివిధ పరీక్షలపై ఆరా తీశారు. అలాగే కొడంగల్‌లో నిర్మించనున్న జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవన నమూనను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్, వైద్యులు బుస్రా, జ్యోతి తదితరులు ఉన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



గోడౌన్ సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని ఈవీఎంల గోడౌన్‌ను కలెక్టర్ ప్రతీక్ జైన్ మంగళవారం పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించి సీల్‌ను పరిశీలించారు. అందులో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లు ఇతర ఎన్నికల సామగ్రి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సీసీ కెమెరాల ద్వారా గోడౌన్‌లో ఉన్న భద్రతా వ్యవస్థను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించి సంబంధిత అధికారుల సమక్షంలో సంతకాలు చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును కూడా ఆయన సమీక్షించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నేమత్‌హాలీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

మద్యం తాగించి, బండరాళ్లతో మోది చంపేసిన దుండగులు

బషీరాబాద్ మండలం నవాల్గ శివారులో ఘటన

7



నవ వధువుకు వరకట్నం కాటు

- వేధింపులు తాళలేక ఆత్మహత్య
- అదనపు కట్నం కోసం హత్య చేశారంటూ అత్తింటివారిపై ఆరోపణ



శ్రీజ(ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో అత్తింట్లో అడుగు పెట్టిన నవ వధువును వరకట్నం కాటేసింది. కంటికి రెప్పాలా చూసుకుంటాడు అనుకున్న భర్త, అత్తింటి వారి చిత్రహింసలకు గురైన నవ వధువు బలవంతంగా తనువు చాలించింది. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సాకేత్‌నగర్ కాలనీకి చెందిన సాయికి నవంబర్ 7న సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన శ్రీజ(21)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద రూ.2 లక్షల నగదు, 12 తులాల బంగారం, ఒక బైక్‌ను ఇచ్చారు. నెల రోజుల పాటు సాఫీగా సాగిన వారి జీవితంలో వరకట్నం వేధింపులు మొదలయ్యాయి. మరో రూ. 3 లక్షలు కావాలని భర్తతో పాటు అత్తింటి వారు వేధించారు. దీంతో శ్రీజ ఈ విషయాన్ని తన తల్లికి చెప్పింది. అనంతరం గొడవలు జరుగుతాయోనని భావించిన శ్రీజ సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రీజ ఉరేసుకుని మృతి చెందినట్లు సాయి తండ్రి అనంతయ్యకు ఫోన్ చేసి సమాచారం అందించారు. శ్రీజ తల్లిదండ్రులు వికారాబాద్ చేరుకుని శ్రీజను చూసి కన్నీరుమున్నీరయ్యారు. అత్తింటి వారు తన కూతురును వరకట్నం కోసం హత్య చేశారని మండిపడ్డారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సాయి కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీజ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

కబ్జా కోరల్లో

సుతారిగూడ చెరువు

సుమారు 8 ఎకరాలు మాయం

- కబ్జా స్థలంలో లారీల అడ్డా ఏర్పాటు
- మురుగు నీటితో కంపుకొడుతున్న చెరువు
- చేపలు చస్తున్నాయంటూ మత్స్యకారుల ఆందోళన
- పట్టించుకోని సంబంధిత అధికారులు

రోజురోజుకూ తగ్గుతున్న విస్తీర్ణం



మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుతారిగూడ చెరువు కబ్జాకోరుల చేతుల్లో చిక్కి, రోజురోజుకూ కుచించుకుపోతోంది. చెరువును కబ్జా చేసి కొందరు ప్రహరీలను నిర్మించగా, మరికొందరు లారీల అడ్డాను ఏర్పాటు చేసుకున్నారు. మరో పక్క, సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలల వారు డ్రెయినేజీని చెరువులో వదిలి చెరువును మురికి కూపంలా మార్చారు. చెరువును కాపాడండి మహాప్రభో అంటూ స్థానికులు పలుమార్లు ఇరిగేషన్, రెవెన్యూ, కలెక్టర్, చివరికి హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీంతో ఈ చెరువులో చేపలు పట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

హద్దురాళ్లు ఏర్పాటు చేసినా..

ప్రస్తుతం సుతారిగూడ చెరువు పరిసరాలను కబ్జా చేయడంతో చెరువు విస్తీర్ణం పూర్తిగా తగ్గిపోయింది. 24 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు ప్రస్తుతం 16 ఎకరాలకు పరిమితమైంది. ఒక పక్క, ఓ వ్యక్తి రెండున్నర ఎకరాల స్థలం కబ్జా చేసి ఏకంగా దాని చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నాడు. ఇరిగేషన్ అధికారులు గతంలో సర్వే చేసి

మిగతా 8వ పేజీలో...

అధికారులు పట్టించుకోవడం లేదు




సుతారిగూడ చెరువు ఆక్రమణలపై ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరువులోకి అక్రమంగా డ్రైనేజీ పైప్‌లైన్లను కలిపిన సీఎంఆర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోదరునికి సంబంధించిన విద్యాసంస్థలు కావడంతో అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. చెరువు స్థలాన్ని కబ్జా చేశారంటూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

-నాగరాజు, సుతారిగూడ నివాసి

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరుకు చెందిన వినాయక సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ సంగీత, వైద్యులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.













హామీలు అమలు చేసి ధర్నాలకు దిగండి

● కాంగ్రెస్‌పై విష్ణువర్ధన్‌రెడ్డి మండిపాటు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, పక్కన నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను పక్కదారి పట్టించాలన్న కుట్రతో కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ ధర్నాలు చేయడం అన్యాయం అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. షాద్‌నగర్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా పూర్తిగా అమలు చేశారా? అని ప్రశ్నించారు. హైవేలను, రైల్వేలను, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ దేశాన్ని అగ్రభాగాన నిలుపుతున్న కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు, నాయకులు పసలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని ఎమ్మెల్యేలు, మంత్రులు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతు రుణమాఫీ, ఏడాదికి ప్రతీ ఎకరాకు 15వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా 12వేలు, పేద మహిళలకు ప్రతి నెలా 2,500సాయం, 4వేల పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, జర్నలిస్టులకు, తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్ల స్థలాల పంపిణీ వంటి కాంగ్రెస్ హామీల్లో ఎన్ని పూర్తిగా అమలుచేశారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద, చించోడ్‌లను మండలాలుగా చేస్తే ఎమ్మెల్యే సొమ్మేమైనా పోతుందా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి మొగిలిగిద్దకు వచ్చినప్పుడు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండలంగా ఎందుకు ప్రకటింపజేయలేదన్నారు. కుల గణన సర్వే జాబితాలో క్రిస్టియన్ల జనాభా వెల్లడించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదని ప్రజలను తప్పుదోవ పట్టిస్తే ప్రజలు క్షమించబోరని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మోహన్‌సింగ్, లష్కర్‌నాయక్, శ్రీనివాస్, రుషికేష్, రాజు, మహేందర్‌రెడ్డి, గణేష్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల పండుగ.. కాంగ్రెస్‌కు కడుపు మంట



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అందె బాబయ్య, ఇతర నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌తో ప్రజలు పండుగ చేసుకుంటుంటే.. కాంగ్రెస్‌కు మాత్రం కడుపు మండుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య విమర్శించారు. దేశాభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసి కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని హర్షిస్తూ బీజేపీ నాయకులు మంగళవారం షాద్‌నగర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు హరి భూషణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బాబయ్య హాజరై మాట్లాడారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు, రైతులు హర్షించేలా కేంద్రం బడ్జెట్ ఉందన్నారు. దీనిని కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓర్చుకోలేరని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.మురళి, పి.సురేష్, జె.నర్సింహ, ఎం.విజయ్, ఎం.రాము, జి.విజయ్, శ్రీనాథ్, రామకృష్ణ, మణికంఠ, ఆంజనేయులు, రవినాయక్ పలువురు పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగపూర్‌కు చేరుకున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి

సింగపూర్ సదస్సుకు షాద్‌నగర్ అధ్యాపకుడు

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సెమినార్‌కు షాద్‌నగర్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రతినిధి ప్రొఫెసర్ థాం షాంఫైని కలిశానని ఆయన తెలిపారు. అంతర్జాతీయ సెమినార్‌లో వాతావరణం అనే అంశంపై మాట్లాడేందుకు అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

బోగస్ ఓట్లపై అధికారుల విచారణ

నందిగామ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొదళ్లగూడ గ్రామ పంచాయతీ పరిధిలో స్థానికేతరులకు ఓట్లు ఉన్నాయని మొదళ్లగూడకు చెందిన యాదగిరిరెడ్డి షాద్‌నగర్ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి మొదళ్లగూడ, మంచన్‌పాడు, సింబియాసిస్ యూనివర్సిటీ, మజీద్ మామిడిపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాలను తనిఖీ చేశారు. స్థానికేతరుల, 18ఏళ్లు నిండినివారి పేర్లను పరిశీలించారు. బోగస్ ఓట్లున్నాయనే ఫిర్యాదుతో విచారణ చేశామని, బోగస్ ఓట్లు తేలితే ఆ పేర్లను తొలగిస్తామని అధికారులు చెప్పారు. విచారణలో అధికారులు రాజు, రవి, శ్రీనివాస్, ఉదయ్, ప్రవళిక, మంగమ్మ గ్రామస్తులు పాల్గొన్నారు.



సింబియాసిస్ యూనివర్సిటీలో బోగస్ ఓట్లపై విచారణ చేస్తున్న అధికారులు

వీధి దీపాలకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాండూరులోని అంబేడ్కర్ చౌక్ నుంచి ఇందిరాచౌక్ వరకు వెళ్లే రోడ్డు మార్గంలోని హైమాస్ట్, ఎల్ఈడీ లైట్లకు మంగళవారం మరమ్మతులు చేశారు. ప్రధానంగా అంబేడ్కర్ చౌక్‌లో లైట్లు వెలగక చీకటి నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జనవరి 24న 'వీధి లైట్ల ఏర్పాటులో విఫలం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. హైమాస్ట్ లైట్లను రిపేర్‌తో ప్రజలకు ఇబ్బందులు తొలిగాయి.



ఇందిరాచౌక్-అంబేడ్కర్ చౌరస్తా రోడ్డులో లైట్లు రిపేర్ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు

మార్కెట్ ఫీజు ఎగవేత నివారణకు స్పెషల్ డ్రైవ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధారూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): 'ఏడు కిలోల తరుగు, నాలుగు శాతం కమీషన్' శీర్షికన వ్యాపారులు రైతులకు, మార్కెటింగ్ శాఖకు చేస్తున్న మోసాలను వివరిస్తూ మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో గ్రామాల్లో జీరో వ్యాపారాన్ని నిరోధించేందుకు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు మంగళవారం వివిధ స్థాయిల అధికారులతో ఒక టీంను ఏర్పాటు చేశారు. ఈ టీంకు ధారూరు మార్కెట్ కమిటీ సహాయ కార్యదర్శి సిద్ధమ్మను లీడర్‌గా నియమించారు. బృందంలో కొడంగల్, పరిగి, ధారూరు, వికారాబాద్ ఏఎంసీల కార్యదర్శులు, నలుగురు మార్కెటింగ్ సూపర్‌వైజర్లు, ప్రతీ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులుంటారు. ధారూర్, పరిగి, కొడంగల్, తుంకిమెట్ల ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేసి గ్రామాల్లో రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్న వ్యాపారులను గుర్తించి వారి నుంచి మార్కెట్ ఫీజు వసూలు చేసి, తూకాల్లో మోసం, తరుగు, కమీషన్ వసూళ్లను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ఈ టీం బుధవారం నుంచి తన డ్రైవ్ నిర్వహిస్తుంది. కాగా రాంపూర్ తండాలో వేరుశనగ బస్తాలను తరలిస్తున్న రెండు డీసీఎంలను నిలిపి మార్కెట్ ఫీజు వసూలు చేశామని మంగళవారం అధికారి సిద్ధమ్మ తెలిపారు. 165 పల్లి బస్తాలకు రూ.9,570 మార్కెట్ ఫీజును వసూలు చేశామని చెప్పారు. జిల్లాలో వ్యాపారులు మార్కెట్ కమిటీలకు ఫీజులు చెల్లించకుండా ఎక్కడైనా నేరుగా రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్నా, తూకాల్లో మోసం చేస్తున్నా, దళారులు కమీషన్లు వసూలుచేస్తున్నా వెంటనే రైతులైనా లేదా సాధారణ పౌరులైనా 8310739661 అనే నంబరుకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

దుర్గమ్మ సన్నిధిలో సీనియర్ న్యాయాధికారి



పాపన్నపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గ భవానీ మాతను ఇబ్రహీంపట్నం కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి రీటాలాల్ చంద్ మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ మర్యాదలతో సత్కరించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎగిరిశెట్టి సత్యం

కొనసాగుతున్న వాలీబాల్ టోర్నీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. యువకులు, విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నారు. మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టిగోదాదేవిసత్యంల ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఓపెన్ టు ఆల్ నాలుగో రాష్ట్రస్థాయి పోటీల్లో మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి, కర్నూల్, ఆత్మకూరు, జడ్చర్ల తదితర ప్రాంతాలకు చెందిన 32టీంలు మంగళవారం రెండో రోజు పాల్గొన్నాయి. బుధవారం పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు ఫస్ట్‌ప్రైజ్ రూ.20,116, సెకండ్ రూ.10,116, థర్డ్‌ప్రైజ్ రూ.5,116, షీల్డ్‌లను ప్రదానం చేస్తామని సత్యం తెలిపారు. కార్యక్రమంలో గోదాదేవి, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, పీఈటీలు మహమూద్, ప్రసాద్, మల్లేశ్, సురేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఏట్లఎర్రవల్లి సమీపంలో బ్రిడ్జి పనులను ప్రారంభిస్తున్న సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి

గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట

షాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధి ఏట్లఎర్రవల్లి వద్ద వాగుపై రూ.2కోట్లతో నిర్మించే వంతెన పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందన్నారు. వాగుపై వంతెన లేక వర్షాకాలంలో గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బ్రిడ్జి నిర్మాణంతో ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. పనులను ముమ్మరంగా చేపట్టి వానకాలం వచ్చేలోగా వంతెనను నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, వేణుగోపాల్, రాజేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, వీరేందర్‌గుప్తా, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, సాయిగణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరాటేలో మెడల్ సాధించిన ఆరాధ్యరెడ్డిని అభినందిస్తున్న కోచ్‌లు

కరాటేలో రెడ్డిపల్లి బాలికకు వెండి పతకం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో ఓ బాలిక మెడల్ సాధించింది. రెడ్డిపల్లికి చెందిన కృష్ణారెడ్డి-నవనీతల కూతురు ఆరాధ్య విశాఖపట్నంలో జరిగిన ఓపెన్ శివమొగ్గ-2025 ఎనమిదో ఇంటర్నేషనల్ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపి వెండి పతకం గెలిచింది. తమ గ్రామానికి చెందిన ఆరాధ్య కరాటేలో మెడల్ సాధించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కానిస్టేబుల్ మానసను అభినందిస్తున్న సీఐ పరశురాం, ఎస్సైలు

మెడల్ సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు విధులతో పాటు క్రీడల్లో రాణించడం అభినందనీయమని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరశురాం అన్నారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ జి.మానస గోల్డ్ మెడల్, రెజ్లింగ్‌లో బ్రోంజ్ మెడల్ సాధించారు. జి.మానస మంగళవారం పోలీసుస్టేషన్‌లో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ, శేఖర్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే క్యాన్సర్ దూరం



మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్యశ్రీ

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని నీలిమ ఆస్పత్రి వైద్యురాలు సౌమ్యశ్రీ అన్నారు. పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్ నీలిమ మెడికల్ కళాశాలలో మంగళవారం జరిగిన ప్రపంచ కాన్సర్ నివారణ దినోత్సవంలో ఆమె మాట్లాడారు. క్యాన్సర్ రకాలు, కారకాలపై వివరించారు. క్యాన్సర్ నిర్ధారణ, నివారణ పద్ధతులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ వసుధభక్తి, ఎన్ఎస్ఎస్ కోర్డినేటర్ మల్లేష్, డాక్టర్లు రాజేంద్రకుమార్, శిరీష, శ్రుతి, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన

శామీర్‌పేట: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతీ విద్యార్థిని అప్రమత్తంగా ఉంటూ వ్యాధి రాకుండా చూసుకోవాలని నివారించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. శామీర్‌పేట ప్రభుత్వ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలో ప్రిన్సిపాల్ ఇష్రత్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే నిర్వహించారు. క్యాన్సర్ ప్రాణాంతక వ్యాధి అని, ఇది రాకుండా నివారణ, జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. సదస్సులో కళాశాల వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి విద్యార్థులకు క్యాన్సర్ వ్యాధి నివారణపై పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ శానిటరీ న్యాప్కిన్స్‌ను వాడాలి

తాండూరు రూరల్: ప్రతీ గ్రామంలో ప్లాస్టిక్ నిరోధంపై అవగాహన కల్పించాలని అమ్మ ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పేర్కొన్నారు. జినుగుర్తిలో ప్లాస్టిక్ నిరోధంపై ఆశా వర్కర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్లాస్టిక్ శానిటరీ న్యాప్కిన్స్‌తో మహిళలకు గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. క్యాన్సర్ నివారణకు నాబార్డ్, టెక్నోడ్రీమ్ సహకారంతో తయారు చేస్తున్న ఆర్గానిక్ శానిటరీ న్యాప్కిన్స్‌ను ఎన్‌జీవో ఆధ్వర్యంలో గ్రామాల్లో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఆశా వర్కర్లు గ్రామాల్లో అవగాహన కల్పించి మహిళలు వాటిని వాడేలా చూడాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై స్వామివారి ఊరేగింపు



లక్ష్మీవేంకటేశ్వరస్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో చేవెళ్లలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం మార్మోగింది. మంగళవారం రథసప్తమిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు నిర్వమించారు. వేంకటేశ్వర స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ, హంస వాహనసేవ, సింహ వాహనసేవ, శేష వాహనసేవలను నిర్వహించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నరేందర్, ధర్మకర్తలు వమానాచార్యులు, శ్రీపాద్, కన్నా, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

కొడంగల్: రథ సప్తమి సందర్భంగా కొడంగల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వేడుకలను నిర్వహించారు. సూర్యభగవానుడిని దర్శించుకునేందుకు భక్తులు ఉదయాన్నే ఆలయానికి పోటెత్తారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా సూర్యప్రభ వాహనంపై వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. వేంకటేశ్వరస్వామికి పురోహితులు విశేషంగా పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం లాంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. కొడంగల్ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



కొడంగల్‌లో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

మాకేది 'భరోసా'?

(ఐదో పేజీ తరువాయి)



అత్యధికంగా 833 మంది రైతులకు రూ.1.38 కోట్లు, అత్యల్పంగా ధారూరు మండలం, అవుసుపల్లిలో 192 మంది రైతుల ఖాతాలకు రూ.16.16 లక్షలు నగదు రూపంలో రైతుభరోసా సొమ్మును బదిలీ చేశారు.

కొందరికే ఇవ్వడంపై ఆందోళన

ఉమ్మడి జిలా వ్యాప్తంగా అర్హులైన రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12 వేల చొప్పున నగదు జమ చేసే ప్రక్రియ జనవరి 26వ తేదీ నుంచి ప్రభుత్వం మొదలు పెట్టింది. వానాకాలం, యాసంగి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఈ నగదును అందించనుంది. ప్రస్తుతం ప్రభుత్వం రూపొందించిన విధానాల ప్రకారం సాగులో ఉన్న, సాగుకు యోగ్యమైన భూములకు పెట్టుబడి సాయం అందుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలను తొలి విడతలో ఒక్కో మండలంలో ఎంపిక చేసిన ఒక గ్రామంలో అర్హులైన అందరికీ పూర్తి స్థాయిలో వర్తింపజేసేలా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎంపిక చేసిన గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేయగా, మాకెప్పుడు ఈ పథకాలన్నీ వస్తాయంటూ మిగతా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను కొందరికి వర్తింపజేసి, కొందరికి ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేవలం 46 గ్రామాల రైతులకే..

రంగారెడ్డి జిల్లాలో మొత్తం 7,51,441 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా సాగుకు యోగ్యంగాలేని 50,119 ఎకరాలను గుర్తించారు. అలాగే సాగుకు యోగ్యమైనవిగా 7,01,322 ఎకరాలను గుర్తించారు. వికారాబాద్ జిల్లాలో సాగు భూములు 6,49,502 ఎకరాలు ఉండగా అందులో 7,496 ఎకరాలను సాగుకు యోగ్యం కాని భూములుగా గుర్తించారు. అలాగే మేడ్చల్ జిల్లాలో మొత్తం భూములు 79,280 ఎకరాలు ఉండగా 14,430 ఎకరాల భూములను సాగుయోగ్యంగా లేనట్లు గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,128 గ్రామాలుండగా అందులో కేవలం 46 గ్రామాల రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందింది. మిగతా 1,082 గ్రామాల రైతులు పెట్టుబడి సాయానికి ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఏడాదిగా సాయం అందడం లేదు



టేకులపల్లిలో మాకు ఏడెకరాల భూమి ఉంది. పెట్టుబడి సాయం కింద ఒకనెల అటూ.. ఇటూ మా ఖాతాలో డబ్బులు పడుతుండేవి. ఏడాదవుతున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన రైతు భరోసా రాలేదు. కొత్త ప్రభుత్వం హయాంలో ఇప్పటికే రెండుసార్లు రైతులు పెట్టుబడి సాయాన్ని కోల్పోయారు. మూడోసారైనా ఇస్తారనుకుంటే .. ఇప్పుడు కూడా ఎదురుచూపులు తప్పడం లేదు. ఎంపిక చేసిన ఒక గ్రామం రైతులకు ఇస్తే.. మిగతా రైతులకు ఎప్పుడు ఇస్తారు? ప్రభుత్వం ఇప్పటికైనా రైతులందరికీ రైతు భరోసా అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- జి.రామయ్య, రైతు, టేకులపల్లి, మోమిన్‌పేట్ మండలం, వికారాబాద్ జిల్లా

మాతా-శిశు ఆరోగ్య కేంద్రంలో

శిశువు మృతి

» డ్యూటీ డాక్టర్‌కు మెమో

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):తాండూరు-వికారాబాద్ రోడ్డులో గల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో సోమవారం రాత్రి ఓ శిశువు మృతిచెందింది. పెద్దేముల్ మండలం తట్టెపల్లికి చెందిన రాజేశ్వరి మొదటి కాన్పు కోసం గత నెల 26న ఆస్పత్రిలో చేరింది. సోమవారం నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డను ప్రసవించింది. కొద్దిసేపటికే శిశువు అస్వస్థతకు గురై మృతిచెందగా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. శిశువు మృతికి గల కారణాలపై డీసీహెచ్‌వో ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్ విచారణ చేశారు. డ్యూటీ డాక్టర్ శ్రావణిని వివరణ కోరుతూ మెమో ఇచ్చారు. వైద్యురాలి తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని డీసీహెచ్‌వో తెలిపారు. శిశువు శ్వాస ఆడక మృతిచెందినట్లు ప్రాథకంగా గుర్తించినట్లు ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్

చేవెళ్ల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదరిక నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం అన్నారు. మంగళవారం చేవెళ్లలో బీజేపీ నాయకులతో కలిసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకరం చేశారు. అనంతరం హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రత్నం మాట్లాడుతూ... దేశంలోని ప్రజలందరికీ ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఉద్యోగులకు రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు గొప్ప విషయమన్నారు. వచ్చే ఐదేళ్లలో ప్రపంచ ఆర్థిక రంగంలో మనదేశం మూడో స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి, ఉపాధ్యక్షుడు జి.కృష్ణాగౌడ్, నాయకులు వెంకట్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కుమార్, శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం చేస్తాయని, మనిషి సన్మార్గంలో పయనిస్తేనే దైవానుగ్రహం కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు కడ్తాల్‌లోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి వారితో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామంలో ఉత్సవ ఏర్పాట్లపై ఆలయ నిర్వాహకులు సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పాలాది ఆంజనేయులు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వై.రాఘవేందర్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని నాయకులు శాలువాతో సత్కరించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు సైతం ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో మాధవులు, రాజు, వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్ ఉన్నారు.

65 స్మార్ట్‌ఫోన్ల చోరీ

» మొబైల్ షాప్‌లో భారీ దొంగతనం

» రూ.15లక్షల విలువైన సామగ్రి అపహరణ



మొబైల్ షాప్‌ను పరిశీలిస్తున్న సీఐ రాజువర్మ, డీఐ శ్రీనివాస్

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మొబైల్ షాప్‌లో భారీ చోరీ జరిగింది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లి మండలం, బోడుప్పల్, బృందావనం కాలనికి చెందిన బర్మ మల్లేశ్ పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ అయ్యప్ప స్వామి దేవాలయం పక్కన మెయిన్ రోడ్డు వద్ద లక్ష్మీనర్సింహ పేరుతో మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ దుకాణం పక్కనే ఉన్న రియల్ మీ మొబైల్ దుకాణం షెట్టర్ తాళంను మంగళవారం తెల్లవారుజామున దుండగులు పగులగొట్టి లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. తాళం వెళ్లకపోగా ఒక దుండగునికి కాలుకు గాయమైంది. ఆ వెంటనే పక్కనే లక్ష్మీనర్సింహ మొబైల్ దుకాణం షెట్టర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అందులోని 67 స్మార్ట్ ఫోన్లతో పాటు 7 ఎల్‌సీడీ టీవీలు, బ్రాండెడ్ మొబైల్ ఫోన్ల సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఉదయం దుకాణం షెట్టర్ కొంత వరకు పైకి లేపి ఉండటాన్ని గమనించిన స్థానికులు మల్లేశ్‌కు సమాచారం అందించారు. దుకాణం వద్దకు చేరకొన్న ఆయన పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాజువర్మ, డీఐ శ్రీనివాస్‌లు దుకాణాన్ని పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఇద్దరు దుండగులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. రూ.15 లక్షల మేర విలువ చేసే ఫోన్లు, టీవీలు, సామగ్రి పోయిందని బాధితుడు మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భూ పొరల్లోని శబ్దాలకు భయాందోళన చెందొద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డి.శశిధర్

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): భూమి పొరల మధ్య సర్దుబాటు జరిగినప్పుడు కొంత మేర శబ్దాలు వస్తాయని, వాటితో ఎలాంటి నష్టం జరగదని, ప్రజలు భయాందోళన చెందొద్దని ప్రిన్సిపాల్/సైంటిస్ట్ డి.శశిధర్ అన్నారు. మంగళవారం టేకుల్‌కోడ్ రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వారం రోజుల క్రితం టేకుల్‌కోడ్, అంగడి రాయచూర్, ధర్మాపూర్, అన్నారం, రుద్రారం, ఉప్పరిపల్లి గ్రామాల్లో భూప్రకంపనలు రావడంతో ప్రజలు తహసిల్దార్‌కు సమాచారం ఇచ్చారు. మైనింగ్, సంబంధిత అధికారులకు ఫోన్‌లో వివరించీరు. అధికారులు చేరుకుని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైంటిస్ట్‌లు, మైనింగ్ అధికారులు మాట్లాడుతూ.. కొన్ని రోజుల క్రితం ఈ ప్రాంతంలో వచ్చిన భూకంపం రిక్టర్ స్కేల్‌పై 2.2పాయింట్లుగా నమోదైందని, ఇలాంటి స్వల్ప ప్రకంపనలతో ఎలాంటి నష్టం జరగదన్నారు. భూ పొరల్లో సర్దుబాటు జరిగే సమాయాల్లో శబ్దాలు వస్తాయని తెలిపారు. భూకంపాలపై ప్రజలకు సమాచార బుక్‌లెట్లు అందించారు. సమావేశంలో జి.సురేష్, టెక్నికల్ ఆఫీసర్ నరేష్, ఏడీ సత్యనారాయణ, తహసీల్దార్ విజయకుమార్, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై జీవీ.సత్యనారాయణ, అధికారులు రాఘవేందర్, చైతన్యకుమార్, ప్రజలు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

మద్యం తాగించి, బండరాళ్లతో మోది హతమార్చిన దుండగులు

» బషీరాబాద్ మండలం నవాల్గ శివారులో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, సీఐ, ఎస్ఐలు

బషీరాబాద్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి మద్యం తాగించి గొంతు నులిమి, బండరాయితో మోది దారుణహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం నవాల్గ శివారులోని ప్రధాన రోడ్డు మార్గం పక్కన మంగళవారం ఉదయం వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నవాల్గ గ్రామానికి చెందిన మాల శామప్ప(31) బషీరాబాద్-తాండూరు ప్రధానం మార్గం తాతగూడి సమీపంలో ఓ చెట్టు కింద మృతదేహమై కనిపించాడు. సమాచారం అందుకున్న బషీరాబాద్ ఎస్ఐ శంకర్, సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆ వెంటనే ఎస్ఐ శంకర్.. తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, సీఐ నగేష్‌కు సమాచారం ఇచ్చారు. సోమవారం రాత్రి వేళ అక్కడి వ్యవసాయ పొలం మధ్యలో శామప్పతో పాటు మరికొందరు మద్యం తాగినట్లు గుర్తించారు. అక్కడే శామప్పను హత్య చేసి శవాన్ని 100 మీటర్ల దూరంలోని చెట్ల వద్దకు లాక్కొచ్చి బండరాయితో మోది హత్య చేసి పడేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అలాగే హత్య జరిగిన చోట పలు ఆధారాలు సేకరించారు. అనుమానంతో అక్కడే ఉన్న మృతుడి వదిన సుగుణమ్మను పోలీసులు లోతుగా విచారించారు. ఇంటి విషయంలో మృతుడు శామప్ప, అన్న నర్సింహులు కుటుంబాల మధ్య గొడవలున్నాయని, ఈ కారణంతోనే అడ్డు తొలగించుకునేందుకు వదిన హత్య చేయించినట్లు తేల్చిన పోలీసులు విషయాన్ని గోప్యంగా ఉంచారు. డీఎస్పీ నేతృత్వంలో రూరల్ సీఐ, ఎస్ఐలు ఘటన స్థలం వద్ద లభించిన ఆధారాలతో విచారణ మరింత ముమ్మరం చేస్తూ రెండు గంటల్లోనే హంతకులెవరానేది తేల్చారు. కాగా హత్య చేసేందుకు మృతుడి వదిన స్థానికంగా ముగ్గురు వ్యక్తులకు రూ.50 వేల సూపారి మాట్లాడి రూ.10 వేలు అడ్వాన్సుగా ఇచ్చినట్లు పోలీసుల విచారణలో బయట పడినట్లు సమాచారం. ఈ హత్య కేసులో కీలక ఆధారాలు పోలీసులకు లభించడంతో అక్కడికక్కడే మృతుడి వదినతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.మృతుడి చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నగేష్ వెల్లడించారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు అందించాలని సీఎం, మంత్రుల ఇళ్ల ముట్టడికి తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం పిలుపునివ్వడంతో మాజీ సర్పంచ్‌లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.మాజీ సర్పంచ్ శిరీష రమేశ్, అశోక్ తదితరులను మంగళవారం అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.

దోమ: సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డిని మంగళవారం ఉదయం పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ సీఎం మాట నిలబెట్టుకోవాలని, ప్రతిపక్ష హోదాలో సర్పంచ్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు.

మోమిన్‌పేట్: పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్‌లో తలపెట్టిన మహాధర్నాకు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లను మంగళవారం మోమిన్‌పేట్ మండలంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాశీరాం, సునిత, మల్లేశం తదితరులు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి నిధులు ఖర్చు చేశామని వాపోయారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నేటి వరకు పెండింగ్ బిల్లులు అందించకపోవడం సరైంది కాదన్నారు.

స్వీపింగ్ స్లీప్!

- రూ.44లక్షలతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు
- వినియోగంలో లేక తుప్పు పడుతున్న వైనం
- కమీషన్ కోసమే తెచ్చారని విమర్శలు



స్వీపింగ్ మిషన్

పరిగి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంటే ఏంచేసినా ఎవరూ ఏం చేస్తారన్న ధీమాతో నేటి నాయకులు, అధికారులు ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవసరం ఉన్నా, లేకున్నా మనకు ఏంలాభం వస్తుందనే ఆలోచిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిగి మునిసిపాలిటీ వారు తీసుకొచ్చిన స్వీపింగ్ మిషన్ కథ ఇది. పరిగి మున్సిపాలిటీలో రోడ్లు శుభ్రం చేసేందుకు ఏకంగా రూ.44లక్షలు వెచ్చించి స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన నాటి నుంచి కూడా ఇది ఒక్కరోజు కూడా రోడ్డెక్కలేదు. తీసుకవచ్చిన నాటి నుంచి మూలన పడేశారు. దీంతో లక్షలు వెచ్చించి తీసుకొచ్చిన స్వీపింగ్ మిషన్ తుప్పుపడుతోంది. స్వీపింగ్ మిషన్‌తో శుభ్రం చేసేంతగా పరిగిలో అంతగా రోడ్లు లేకపోయినప్పటికీ కమీషన్ల కోసం ఈ విధంగా ప్రజాధనం వృథాచేస్తున్నారంటూ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాత మిషన్‌కే టీఆర్ నంబరు క్రియేట్ చేసి తెచ్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దాదాపుగా రూ.20లక్షల విలువ కూడా లేని మిషన్‌కు ఏకంగా రూ.40లక్షలకుపైగా లెక్కలు చూపించారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాయకుల తీరు అటుంచితే కనీసం అధికారులు కూడా ముందుచూపు లేకుండా, పనికివస్తుందా? లేదా అని ఆలోచించకుండా నిధులను ఖర్చు చేసేందుకు ఎలా మద్దతిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తీసుకొస్తే తీసుకొచ్చారు కనీసం ఎందుకు వినియోగించలేదో అంతుపట్టని ప్రశ్న. స్వీపింగ్ మిషన్‌కు బదులు జేసీబీని తీసుకొచ్చినా ఉపయోగపడేదని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పరిగి మున్సిపాలిటీలో స్వీపింగ్ మిషన్ కొనుగోలుకు వెచ్చించిన నిధులపై విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

స్వీపింగ్ మిషన్ కొనుగోలుపై విచారణ జరిపించాలి



రూ.44 లక్షలతో తీసుకొచ్చిన స్వీపింగ్ మిషన్‌పై విచారణ జరిపించాలి. ఒక్క రోజు కూడా ఉపయోగించలేదు. కేవలం కమీషన్ కోసం తీసుకొచ్చారు. అది కూడా పాతమిషన్‌కు రంగులువేసి తీసుకొచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తక్కువ ధరకు తీసుకొచ్చి ఎక్కువ బిల్లు డ్రాచేసుకున్నట్లు తెలిసింది. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- టి.వెంకటేశ్, మాజీ కౌన్సిలర్, పరిగి

నేను రాకముందే తెచ్చారు



నేను పరిగిలో బాధ్యతలు చేపట్టకముందే స్వీపింగ్ మిషన్‌ను తీసుకొచ్చారు. దీనికి సంబంధించి మున్సిపాలిటీ నుంచి పేమెంట్ చేసినట్లు తెలుసు. స్వీపింగ్ మిషన్‌ను నడిపించాలంటే ఖర్చుతో కూడుకున్నది. పెట్రోల్ భారీగా అవసరం అవుతుంది. అందుకే దాన్ని వినియోగించడంలేదు.

-వెంకటయ్య, కమిషనర్, పరిగి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈనెల 1వ తేదీన పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి సబిత ఆరోపించారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ, నాగమణి, అలివేలు, భారతమ్మ, జోత్స్న, మమత, సంతోష పాల్గొన్నారు.

తాండూరు: తాండూరులో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన చేపట్టారు. పట్టణంలోని ఇందిరాచౌక్‌లో మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, వికారాబాద్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ అనిల్, తాండూరు మండల ప్రెసిడెంట్ సుధాకర్, యూత్ కాంగ్రెస్ పెద్దేముల్ మండల ప్రెసిడెంట్ మహేష్, బషీరాబాద్ మండల ప్రెసిడెంట్ సతీష్, బషీరాబాద్ యూత్ కాంగ్రెస్ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు గుర్తించే విధంగా ఎదగాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర

తాండూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పదికాలల పాటు అందరు గుర్తించుకునే విధంగా మనం వ్యవహరించాలని అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర అన్నారు. తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాలలో వివిధ కళాశాల విద్యార్థులకు అభయ ఫౌండేషన్, ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మోటివేషన్ కార్యక్రమంలో మంగళవారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తు ప్రతి ఒక్కరు చదవడం, రాయడం, వినడం వల్లనే కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అవలంబించుకోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఆర్ వ్యవస్థాపకులు లొంక నర్సింహులు, మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఉత్తం చంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మేలు చేసే బడ్జెట్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతీఒక్క నిరుపేద ఆర్థికంగా ఎదిగే విధంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తయారు చేయటం హర్షణీయమని బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మంగళవారం హర్షం వ్యక్తంచేస్తూ మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

ఘట్‌కేసర్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతనజీవుల టాక్స్ వెతలను దూరం చేసేందుకు దోహదపడుతుందని బీజేపీ ఎస్టీమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు, నానావత్ బిక్కునాయక్, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్, అన్నోజిగూడలో మంగళవారం కేంద్ర బడ్జెట్ పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

శామీర్‌పేట: రాష్ట్రానికి న్యాయమైన బడ్జెట్‌ను పెట్టినందుకుగాను మంగళవారం అలియాబాద్ చౌరస్తాలో మండల బీజేపీ అధ్యక్షుడు కొర్వి కృష్ణ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీని అభినందిసూ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొడంగల్: బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో మంత్రి వర్గం ఆమోదంతో తీర్మానం ప్రవేశపెట్టడంతో మంగళవారం సాయంత్రం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్. ప్రశాంత్, కృష్ణంరాజు, శివకుమార్ గుప్త, అంబయ్యగౌడ్ పాల్గొన్నారు.

జగన్మోహన్ సేవలు చిరస్మరణీయం



జగన్మోహన్‌రెడ్డి(ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జగన్మోహన్‌రెడ్డి (55) సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న జగన్మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి మృతి చెందారు. మంగళవారం సాయంత్రం వికారాబాద్‌లో జగన్మోహన్ అంత్యక్రియలు జరిగాయి. రిటైర్డ్ పీఆర్ఈఈ మనోహర్ రావు, ఈఈ ఉమేష్ కుమార్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఉపాధ్యాయులు హాజరై నివాళులర్పించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం ఆవరణలో జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఊరడమ్మా.. సల్లంగా చూడమ్మా



ఊరడమ్మకు బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): ఊరు, వాడ సల్లంగా సూడుతల్లీ అంటూ తాండూరు మండలంలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో గల కొత్లాపూర్ గ్రామ ప్రజలు గ్రామదేవత ఊరడమ్మకు మంగళవారం బోనాలు సమర్పించారు. బోనాల అనంతరం పోతురాజుల విన్యాసం పలువురిని ఆకట్టుకుంది. ఏర్పులమ్మ భవిష్యవాణి వినిపించారు.

భక్తిశ్రద్ధలతో సప్తవాహన సేవ



ముత్యాలపందిరిపై అనంతపద్మనాభ స్వామి ఊరేగింపు

వికారాబాద్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమి సందర్భంగా మంగళవారం అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సప్తవాహన సేవలోస్వామి వారిని ఊరేగించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తరలి వచ్చారు.

పెరిగిన వార్డుల సంఖ్య

ధారూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపూర్‌ఖుర్దు, లక్ష్మీనగర్ తండా గ్రామాలు కొత్తగా పంచాయతీలు ఏర్పడటంతో వార్డుల సంఖ్య పెరిగిందని ఎంపీడీవో నర్సింహులు తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం రాజకీయ పార్టీలతో సమావేశమై ఓటరు తుది జాబితా పై చర్చించారు. ప్రస్తుత 34 పంచాయతీలలో 286 వార్డులు ఏర్పాటు చేశామని, ఇందులో 36 వేల 304 మంది ఓటర్లు ఉన్నారని ఆయన వివరించారు. ఇందులో మహిళ ఓటర్లు 18,473 మంది, పురుషులు 17,831 మంది ఉన్నారని ఆయన చెప్పారు. ఓటరు జాబితాలో ఏమైనా అనుమానాలుంటే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీవో షఫీఉల్లా, సూపరింటెండెంట్ సుశీల్‌కుమార్ షిండే, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ బాధ్యులు మాన్‌సింగ్, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో సుతారిగూడ చెరువు

(5వ పేజీ తరువాయి)

హద్దురాళ్లు పాతినప్పటికీ సదరు వ్యక్తి ఆ ప్రహరీని తొలగించలేదు. దీనికి తోడు ఆ పక్కనే ఉన్న సీఎంఆర్ కళాశాలల వారు సైతం చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో ప్రహరీని నిర్మించుకున్నారు. సర్వే నంబర్ 45 లో 23 గుంటలు, సర్వే నంబరు 3లో 10గుంటలు కబ్జా చేసి యథేచ్ఛగా ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని లారీల అడ్డాగా మార్చుకున్నారు. చెరువులో మురికినీరు చేరకుండా ఉండేలా పలుమార్లు కళాశాల యాజమాన్యంతో స్థానిక మత్స్యకారులు మాట్లాడినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. ఈ మురుగు చెరువు అంచుల్లో నుంచి పారుకుంటూ నేరుగా మేడ్చల్ పెద్దచెరువులోకి చేరుతోంది. ఫలితంగా సుతారిగూడ చెరువుతో పాటు పెద్ద చెరువు నీరు మురికిగా మారే పరిస్థితి దాపురించింది. స్థానికులు సంబంధిత అధికారులకు వినతులు సమర్పించినప్పటికీ కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి.

ఆందోళనలో స్థానికులు

చెరువు సమీపంలో ఉన్న శ్మశాన వాటికకు వెళ్లి దహన సంస్కారాలు చేయలేని దయనీయ స్థితిలో స్థానికులు ఉన్నారు. ఈచెరువు ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉండటంతో చెరువు పరిసరాల్లోని భూములకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉంది. ఇక్కడ లారీల అడ్డాలు, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, హోటళ్ల ఏర్పాటు చేసుకోవడానికి చాలామంది ఉత్సాహం కనపరుస్తున్నందున కొందరు చెరువు అంచుల్లో మట్టి డంప్ చేసి చదునుగా మార్చి చిన్నపాటి కంటైయినర్‌లను ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నారు. ఒక వైపు మురికి బెడద. మరోవైపు కబ్జాల పర్వంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ క్షీణిస్తున్న చెరువు పరిస్థితి చూసి కాపాడలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు తూతూ మంత్రంగా దర్యాప్తు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారే తప్ప చెరువు స్థలం కబ్జా కాకుండా, మురికినీరు చేరకుండా చర్యలు తీసుకోవటం లేదని సుతారిగూడవాసులు ఆరోపిస్తున్నారు.

బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

యాలాల, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అఖిలపక్షం పార్టీల నాయకులు అన్నారు. యాలాల ఎంపీడీవో కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీ నాయకులు, బీసీ నాయకులు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్‌రెడ్డి, ఆకుల బస్వరాజ్, సీపీఎం మండల కార్యదర్శి యు.బుగ్గప్ప, బీజేపీ మండల అధ్యక్షుడు శివకుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వడ్డె రాములు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలను అణిచివేసేందుకు కుట్ర చేస్తుందని మండిపడ్డారు. 2014లో 52శాతం ఉన్న బీసీలు 2024లో 45శాతంకు ఎలా తగ్గుతారని ప్రశ్నించారు. రిజర్వేషన్లు కాపాడేందుకు 7శాతం ఉన్న ఓసీల జనాభాను 15.79శాతంకు పెంచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చెన్నారం మాజీ సర్పంచ్ శివకుమార్, చిన్నరెడ్డి పటేల్ పాల్గొన్నారు.

ఐదు రోజులు మేడ్చల్-గండిమైసమ్మ రోడ్డు బంద్

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి అయోధ్య చౌరస్తా వద్దగల రైల్వే గేటు మరమ్మతులు చేపడుతున్నందున ఐదు రోజుల పాటు మేడ్చల్ - గండిమైసమ్మ రహదారి పై వాహనాల రాకపోకలను నిషేదిస్తున్నామని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తెలిపారు. బుధవారం నుంచి 9వ, తేదీ వరకు ఈ రోడ్డు పై నడిచే వాహనాలు రూటు మార్చు కోవాలని కోరారు. మేడ్చల్ నుంచి గండిమైసమ్మ వెళ్ల తలచిన వాహన దారులు రింగ్‌రోడ్డు పై నుంచి లేక కొంపల్లి దూలాపల్లి వైపు నుంచి వెళ్ల వచ్చని తెలిపారు. రైల్వే గేటు మరమ్మతులు పూర్తి చేసిన వెంటనే తిరిగి రాకపోకలు కొనసాగుతాయని సీఐ తెలిపారు.

సంక్షిప్తంగా..

కాంగ్రెస్‌లో చేరిక

నవాబుపేట: మండల పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మహాప్రదర్శనను జయప్రదం చేయాలి

చౌడాపూర్: ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుకల సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ సభ కోసం పరిగిలో కొడంగల్ కూడలి నుంచి ఏబీఎస్ ప్లాజా వరకు డప్పులతో ర్యాలీగా వెళ్లేందుకు మంగళవారం డీఎస్పీ శ్రీనివాస్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు అనుమతి ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఘట్‌కేసర్: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు తమవంతు సహకారం అందించాలని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్ అన్నారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తా వద్ద రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు.

మెగా వైద్యశిబిరం

శామీర్‌పేట: మండల కేంద్రం శామీర్‌పేట పంచాయతీ కార్యాలయాల వద్ద ఘనపూర్‌కు చెందిన మెడిసిటీ ఆస్పత్రి వారు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దేముల్: విద్యార్థులు కష్టపడి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో నర్సింగ్‌రావు తెలిపారు. తట్టెపల్లిగ్రామంలోని హరిజనవాడ, ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు జయరాంతండా, ఓంప్లానాయక్ తండా, పాషాపూర్ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా పటేల్ విజయ్‌కుమార్

దౌల్తాబాద్: యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా పటేల్ విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని చెన్నకేశవ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్, తాలూకా అధ్యక్షుడు మన్నె బస్వరాజ్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడిగా పటేల్ విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

కోర్టు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం

పరిగి: పరిగి కోర్టు ఆవరణలో ధృవ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పరిగి మునిసిఫ్ కోర్టు న్యాయాధికారిణి నాగుల శిల్ప, ఏజీపీ సీహెచ్ బాలముకుందం పాల్గొన్నారు.

బీసీ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా అనిత

తాండూరు: బీసీ తాండూరు డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా అనితను నియమిస్తూ ఆ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్, జిల్లా మహిళ అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్‌చారీలు నియమక పత్రాన్ని అందజేశారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నర్సింహ

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన అచ్చిని నర్సింహ రెండవ సారి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు.

క్రికెట్ పోటీల్లో యువకుల ప్రతిభ

మోమిన్‌పేట్: టేకులపల్లి సుద్దోడుకు తండాలో మంగళవారం ఒక రోజు క్రికెట్ పోటీల్లో సంగారెడ్డి జిల్లా ఇప్పళ్లగడ్డ తండాకు చెందిన జట్టు మొదటి బహుమతి, కొండాపూర్ మండలం శివన్నగూడెం జట్టు ద్వితీయ బహుమతిని అందుకున్నారు.

ఆలయాల్లో తిరుపతిరెడ్డి పూజలు

వికారాబాద్: పట్టణంలో వెలిసిన వెంకటాపూర్ శ్రీ జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయ 18వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం 4వరోజు శ్రీ జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయ 18వ వార్షికోత్సవంలో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి పాల్గొని పూజలు చేశారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..

శామీర్‌పేట: రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



అన్నోజిగూడ వంతెనపై దగ్ధమవుతున్న కారు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్‌కు చెందిన డాక్టర్ చుక్క కిరణ్ మంగళవారం తన బైక్‌పై కామారెడ్డి నుంచి హైదరాబాద్ నగరానికి వెళ్తుండగా మేడ్చల్ పట్టణ అత్వేల్లి సమీపంలోని రేకుల బావి వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా కిరణ్ వృత్తి రీత్యా ప్రైవేట్ ఆస్పత్రి డాక్టర్‌గా పోలీసులు పేర్కొన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం మేడ్చల్ పట్టణ చెక్‌పోస్టు సమీపంలో యూటర్న్ వద్ద బైక్‌పై ప్రయాణిస్తున్న ఉషప్ప(40), ఆంజనేయులు, శ్రీనివాస్‌లకు గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో ఉషప్ప అక్కడికక్కడే మృతిచెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈత కోసం చెరువులో దూకిన యువకుడు..

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడు చెరువులో ఈతకు వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన బొంరాస్‌పేట్ మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుద్యాల మండలంలోని కుదురుమళ్లకు చెందిన రాజు(25) తన స్నేహితుడు సుదర్శన్‌తో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం సొంత గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. మార్గమధ్యలో పరిగిలో ఇద్దరూ కలిసి మద్యం సేవించినట్లు సమాచారం. మద్యం మత్తులో బొంరాస్‌పేట్ పెద్ద చెరువులో ఈత కోసం చెరువు కట్టపై గల బతుకమ్మ ఘాట్ వద్ద చెరువులోకి దూకడంతో ఊపిరాడక మృతిచెందినట్లు స్నేహితుడు సుదర్శన్ తెలిపినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు చెరువు కట్ట దగ్గరికి చేరుకొని సాయంత్రం నుంచి మృతదేహం కోసం గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. కోట్‌పల్లి నుంచి గజఈతగాళ్ల సాయంతో చెరువులో మృతదేహం కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రైల్వేపోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి మాదవరెడ్డి బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (అందాజ 40) మంగళవారం రాత్రి ఖాజ్‌నగర్- బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అతడి తల ముక్కలైంది. లోకల్ పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహంతో పాటు పరిసరాలను పరిశీలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు కావాలనే రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి కుడిచేతికి రేజు అని టాటు ఉంది. లైట్ గ్రీన్ షర్టు, బ్లూ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపారు.

మంటలు చెలరేగి కారు దగ్ధం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గచ్చిబౌలికి చెందిన సాయి తన నలుగురు మిత్రులతో కలిసి కొమురవెల్లి పుణ్యక్షేత్రానికి ఘట్‌కేసర్ మీదుగా వెళ్తుండగా అన్నోజిగూడ వంతెనపైకి రాగానే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్ అప్రమత్తమై మిత్రులతో కలిసి బయటపడ్డారు. కారులో ఉన్నవారికి ఎలాంటి హానీ కలగలేదని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పెద్దేముల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చెరుకులోడ్‌తో వెళుతున్న లారీకి నిప్పంటుకోగా త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన పెద్దేముల్ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద జరిగింది. పెద్దేముల్ గ్రామానికి చెందిన రైతు ఖాసీం పొలం నుంచి లారీలో చెరుకును తరలిస్తున్నారు. లారీ పానాదిగుండా వెళ్తుండగా లారీలోని చెరుకుకు విద్యుత్ తీగలు తగిలి మంటలు అంటుకున్నాయి. దీంతో అక్కడే ఉన్న రైతులు అప్రమత్తమై వ్యవసాయ పొలంలోని బోరు నుంచి కడవలతో నీరుపట్టుకువచ్చి చెరుకుకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. దీంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

లింకు నొక్కడంతో డబ్బులు మాయం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మొబైల్‌లో వచ్చిన లింకును నొక్కి ఓ వ్యక్తి డబ్బులు పోగొట్టుకున్న సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పందిరి పరశురాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘనాపూర్‌కు చెందిన మహేందర్ గతనెల 26వ తేదీన గుర్తుతెలియని మొబైల్ నుంచి లింకు రాగా అది లోన్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తు ఫారం అనుకొని నింపాడు. మరుసటి రోజు వేరే మొబైల్ నుంచి ఫోన్‌చేసి మీ లోన్ మంజూరైంది. పేపర్ వర్క్ చేయడానికి రూ.32వేల 50లు పంపాలని చెప్పడంతో మహేందర్ గూగుల్‌పే ద్వారా అతడికి డబ్బులు పంపాడు. తర్వాత ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించలేదు. దీంతో మహేందర్ మోసపోయానని గ్రహించి ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 13 మంది రిమాండ్

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్ఐ అరవింద్ సూచించారు. అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడిన 13 మందిని వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కోర్టులో హాజరు పర్చగా చంద్రయన్‌పల్లికి చెందిన హనుమంతు, గోపాల్, చించల్‌పేట్‌కు చెందిన శ్రీహరి, మల్లారెడ్డిగూడెంకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ముగ్గురికి రూ.1000 జరిమానా చొప్పున ఒక రోజు సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ఉమాహారతి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

'జీవ మిత్ర' సేవలు అభినందనీయం



సత్తయ్యకు జ్ఞాపికను అందజేస్తున్న జీవ మిత్ర ఆర్గనైజేషన్ సభ్యులు

కులకచర్ల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధంపై జీవ మిత్ర ఆర్గనైజేషన్ వారు చేస్తున్న కృషి అభినందనీయమని హైదరాబాద్ డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి హెచ్‌డీసీసీబీ కార్యాలయంలో మంగళవారం జీవ మిత్ర ఆర్గనైజేషన్ సభ్యులు సాయిభరత్ కుమార్, ఉత్తమ్‌కుమార్‌లు కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో సుబ్రమణ్యం పాల్గొన్నారు.